
సాక్షి ఒడిశా

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,09,105
బంగారం	390 మిల్లీ గ్రాములు
వెండి	33 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఆహార ధాన్యాల ఏటీఎం ప్రారంభం

స్థానిక మంచేశ్వర్‌లో ఆహార ధాన్యాల ఏటీఎం 'అన్నపూర్తి'ని మంత్రి కృష్ణచంద్ర పాత్రో గురువారం ప్రారంభించారు.

- 8లో



కొత్త మద్యం దుకాణాలు తెరిచేది లేదు

- 8లో

రాష్ట్రంలో ఇకపై కొత్త మద్యం దుకాణాలు తెరవబోమని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ గురువారం తెలిపారు.

న్యూస్‌రీల్

20 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో కలెక్టర్లను భారీ స్థాయిలో బదిలీ చేశారు. తాజా ఉత్తర్వులతో 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు.

జిల్లా	కలెక్టర్
మల్కన్‌గిరి	ఆశిష్ ఈశ్వర్ పాటిల్
ఢెంకనాల్	సోమేష్ కుమార్ ఉపాధ్యాయ
నవరంగ్‌పూర్	శుభంకర్ మహాపాత్రో
బాలాసోర్	సూర్యవంశీ మయూర్ వికాస్
జగత్‌సింగ్‌పూర్	జె.సోనల్
కలహండి	పవార్ సచిన్ ప్రకాష్
నయాగడ్	అక్షయ్ సునీల్ అగర్వాల్
భద్రక్	దిలీప్ రౌత్రాయ్
గజపతి	బిజయ్ కుమార్ దాస్
కేంద్రాపడా	స్మృతి రంజన్ ప్రధాన్
రాయగడ	పారుల్ పటవారి
కంధమల్	అమృత్ రుతురాజ్
సంబలపూర్	సిద్దేశ్వర్ బలిరామ్ బొందార్
కటక్	దత్తాత్రేయ భావు సాహెబ్ షిండే
మయూర్‌భంజ్	హేమకాంత సాయె
జాజ్‌పూర్	పి.అన్వేష రెడ్డి
సుందర్‌గఢ్	మనోజ్ సత్యవాన్ మహాజన్
దేవ్‌గఢ్	కబీంద్ర కుమార్ సాహు
నువాపడా	మధుసూదన్ దాస్
బౌధ్	సుబ్రత్ కుమార్ పండా

బీజేపీలోకి కొండబాబు



రాయగడ: జిల్లాలో బీజేడీకి భారీ షాక్ తగలనుంది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు బీజేపీ గూటికి చేరనున్నారు. ఈనెల 16వ తేదీన రాజధాని భువనేశ్వర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, సీనియర్ నాయకుల సమక్షంలో సుమారు 250 మంది మద్దతుదారులతో కలిసి బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు కొండబాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గత 40 ఏళ్లుగా పార్టీకి ఎన్నో సేవలు అందించిన తనకు సరైన ప్రాముఖ్యత ఇవ్వకపోవడంతో బీజేడీని వీడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇక నుంచి జిల్లాలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

అనుమానాస్పదంగా వృద్ధ దంపతుల మృతి



వృద్ధుల మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరి పోలీసుస్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా వృద్ధ దంపతులు మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. డబరగుడ పంచాయతీ తంగురు గ్రామానికి చెందిన చైతన్య మండల్ (65), ఉర్జసీ మండల్ (62)లు కొండపై నివాసముంటున్నారు. కొండకింద నివాసముంటున్న వారి కుమారుడు ఇస్మాయిల్ మండల్ బుధవారం ఉదయం తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. అయితే అప్పటికే వారిద్దరూ రక్తపు మడుగులో వేర్వేరుగా మృతిచెంది ఉన్నారు. దీంతో గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి విచ్చేసి దర్యాప్తు ప్రారంభించారు. వృద్ధ దంపతులు అర్ధరాత్రి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఎవరైనా వారిని హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్.ఉదయగిరి ఐఐసీ సవ్యసాచి మల్ల తెలియజేశారు.

అఠాగొడా బీడీవో అరెస్టు



సోదాలో బయటపడిన బంగారం వగైరా సొత్తు



ప్రదీప్ కుమార్ సాహు

భువనేశ్వర్: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు అఠాగొడా మండల అభివృద్ధి అధికారి (బీడీవో) ప్రదీప్ కుమార్ సాహుని గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ప్రదీప్ కుమార్ సాహుకి సంబంధించిన ఆస్తులపై విజిలెన్సు అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. దీనిలో ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. విజిలెన్స్ అధికారుల ప్రకటన మేరకు ఖుర్దా జిల్లాలోని పాత పోలీసు ఠాణా సమీపంలోని భలిబడిలో ఒక భవనం, నయాగఢ్ జిల్లా రాజొసున్నాఖొలా ప్రాంతంలో మరో భవనం, భువనేశ్వర్ గౌతమ్ నగర్‌లో ఒక ఫ్లాట్, 3 ఇండ్ల స్థలాలు, నయాగడ్ జిల్లాలో రాజొసున్నాఖొలో ప్రాంతంలో అతని కుటుంబ సభ్యుల పేరు మీద ఆస్తులు ఉన్నట్లు సోదాలో బయటపడినట్లు పేర్కొన్నారు.

● ప్రయాస



అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం కోసం ఒక నిండు గర్భిణీ 4 కిలోమీటర్లు నడిచి వెళ్తూ ప్రయాస పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బొయిపరిగుడ సమితి దసమంతపూర్ పంచాయతీ సారుకొండ గ్రామానికి చెందిన లక్ష్మీ గౌడ 8 నెలల గర్భిణి. అయితే ఆ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో కొలార్ పంచాయతీలోని పాడాపాదర్ గ్రామానికి వెళ్లి ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆమె సుమారు 4 కి.మీ నడిచి వెళ్లి పౌష్టికాహారం తీసుకొస్తూ ఇబ్బందులకు గురైంది. ఇలాగే గ్రామంలోని మహిళలంతా ఇబ్బందులకు గురవుతున్నారని, తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

- జయపురం

● వేడుకులాట



గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కెరడ, జేకేపూర్, కల్యాణ సింగుపూర్, రాయగడ తదితర ప్రాంతాల్లో నాగావళి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కల్యాణ సింగుపూర్ సమితి పరిధిలోని పటబొంధొ, పూజారిగుడ, రివల్‌కొన, గడ్డిశిఖాల్, పొలమ, జగన్నాథపూర్ తదితర ప్రాంతాల్లోని పొలాల్లోకి చేపలు చేరాయి. అలాగే సదరు సమితిలోని భైరగీహలువ, దుమ్మాగుడ, కెరడ, చెక్కాగుడ, వనిజ తదితర ప్రాంతాల్లో చేపలను పట్టుకునేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

- రాయగడ

● ఆందోళన



గత రెండేళ్లుగా గుసాని సమితి బాగుసల గ్రామం వద్ద మహేంద్రతనయ కుడి కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో సుమారు 300 ఎకరాల పంట భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయానికి గురువారం వెళ్లి గుర్రపు డెక్క తొలగించాలని ఆందోళన చేపట్టారు. దీంతో చిన్ననీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ జగన్నాథ్ స్పందించి వారం రోజుల్లోగా పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలియజేశారు.

- పర్లాకిమిడి



తీరంలో హై అలర్ట్..!



సముద్రంలో మెరైన్ పోలీసుల పహరా



- రాష్ట్రంలోకి బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు లేకుండా చర్యలు
- మెరైన్ పోలీసులు అప్రమత్తం
- 18 మెరైన్ స్టేషన్లలో ముమ్మర గస్తీ

భువనేశ్వర్: బంగ్లాదేశ్‌లో రాజకీయ అశాంతి నెలకొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ దేశం నుంచి సముద్ర మార్గం ద్వారా అక్రమ వలసదారుల ప్రవేశాన్ని నివారించడానికి ఒడిశా ప్రభుత్వం సన్నద్ధమైంది. అశాంతి, హింసాకాండ నేపథ్యంలో పొరుగు బంగ్లాదేశ్ నుంచి వచ్చే వలస ముప్పును ఎదుర్కోవడానికి రాష్ట్రంలోని కోస్తా జిల్లాలు ముఖ్యంగా కేంద్రాపడా పోలీసులను సిద్ధం చేశారు. ఒడిశాలో బంగాళాఖాతం 480 కిలోమీటర్ల పైబడి విస్తరించి ఉంది. దీంతో తీరంలో హై అలెర్ట్ ప్రకటించారు. ఒడిశాకు అనుసంధాన పరిచే సముద్ర మార్గాలపై పోలీసులు 24/7 నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక బంగ్లాదేశ్ నుంచి వలసదారులను తనిఖీ చేయడానికి తీర ప్రాంతంలో మొత్తం 18 మెరైన్ పోలీసుస్టేషన్లకు హై అలర్ట్ జారీ చేసినట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరుణ్ కుమార్ షడంగి గురువారం తెలిపారు.

శ్రీమందిరానికి భద్రత

బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా అనే మూడు అత్యంత ముప్పు పొంచి ఉన్న తీరప్రాంత జిల్లాలకు హై అలర్ట్ జారీ అయింది. అంతే కాకుండా శ్రీమందిరం వద్ద మెరుగైన భద్రతా చర్యలతో పూరీ ప్రాంతంపై అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం బంగ్లాదేశ్ నుంచి ఎవరైనా సముద్ర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి చొరబడకుండా నిరోధించడానికి ముఖ్యంగా రాత్రి సమయంలో పహరాను పటిష్టపరచాలని అన్ని కోస్తా జిల్లాల పోలీసు సూపరింటిండెంట్లకు స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో జైలు నుంచి ఆయుధాలతో బయటపడిన నేరస్తులు సముద్ర మార్గంలో ఒడిశాలో చొరబడే పరిస్థితులు పొంచి ఉన్నాయని సర్వత్రా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర తీరంలోని 18 మెరైన్ పోలీసు ఠాణాలను అప్రమత్తం చేశారు. పడవలు, ట్రాలర్లలో రాష్ట్రానికి వచ్చే వ్యక్తుల కదలికపై గట్టి నిఘా ఏర్పాటు చేశారు. బంగ్లాదేశ్ చొరబాటు చర్యలను మరింత కట్టుదిట్టంగా ఎదుర్కుంటామని అదనపు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) సంజయ్ కుమార్ తెలిపారు.

బంగ్లాదేశ్ జైలు నుంచి నేరస్తులు

బంగ్లాదేశ్‌లో హింసాకాండ, తర్వాత పరిణామాలతో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేశారు. దీంతో దాదాపు 518 మంది నేరస్తులు షేర్పూర్ జిల్లా జైలు నుంచి ఆయుధాలతో బయటపడ్డారు. అందువలన వీరంతా బంగ్లాదేశ్ నుంచి సముద్ర మార్గం ద్వారా ఒడిశాలోకి ప్రవేశించే ముప్పు గురించి భారత ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించి తీరప్రాంత జిల్లాలను హెచ్చరించింది. రాష్ట్రంలోని బాలేశ్వర్ నుంచి గంజాం వరకు 450 కిలోమీటర్ల పొడవైన తీరం ఇప్పుడు ఒడిశా పోలీసులకు మరిన్ని సవాళ్లను విసురుతోంది. ఈ తీర ప్రాంతం గుండా రాష్ట్రంలో బాలేశ్వర్, భద్రక్, కేంద్రాపడా, పూరీ, గంజాం జిల్లాలకు బంగ్లాదేశ్ చొరబాటుదారులు ప్రవేశించే అవకాశం ఉందని హెచ్చరించారు.

రాష్ట్రంలో 3,987 మంది నిర్వాసితులు

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో 3,987 మంది బంగ్లాదేశ్ నిర్వాసితులు నివసిస్తున్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితి హింసాత్మకంగా మారడంతో, ఆ దేశ నేరస్తులు చేపలు పట్టే పడవలపై తీరప్రాంత జిల్లాల్లో నివసిస్తున్న తమ బంధువుల వద్దకు తిరిగి వచ్చే ప్రమాదం పెరిగింది. అందువల్ల పైన పేర్కొన్న కోస్తా జిల్లాల్లోని 18 సముద్ర తీర పోలీసుస్టేషన్లలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ షడంగి సూచించారు. ఈ మేరకు బలరామగొడి, ధామ్రా, జంబు, పారాదీప్, ఆర్యపల్లి, సోన్‌పూర్, చంద్రభాగ, పెంటకోట, జటాధారి, తొంతియాపాల్, కొసాఫాలా, చూడామణి, తలాసరి తదితర మెరైన్ పోలీస్‌స్టేషన్లలో భద్రతా చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. ఈ స్టేషన్లలో అధికారులు మరియు సిబ్బందితో సహా 15 స్పీడ్ బోట్లను సముద్రంలో పహారా కోసం నియమించారు. బాలేశ్వర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్‌లోని 18 మెరైన్ పోలీస్ ఠాణాలను సైతం అప్రమత్తం చేశారు. పడవల ద్వారా ఎవరైనా చొరబాటుదారులు వస్తే వారిపై నిఘా ఉంచామని, పోలీసు శాఖను కూడా అప్రమత్తం చేశామని పోలీసు వర్గాలు తెలియజేశాయి. మరోవైపు ఏడీజీ సంజయ్ కుమార్ కోస్ట్‌గార్డ్‌ను కూడా అప్రమత్తం చేశారు. కోస్ట్‌గార్డ్ ఏడీజీని నోడల్ అధికారిగా నియమించారు. తీరప్రాంత రక్షణ వ్యవస్థపై ఆయన అధ్యయనం చేయనున్నారు. సాగర తీరం గుండా ఓడ రేవు, ఒడ్డుకు వచ్చే పడవల్లో ఎవరెవరు వస్తున్నారో సమాచారం అందించాలని కోరారు. బంగ్లాదేశ్‌లోని జైలును బద్దలు కొట్టి నేరస్తులు బయటకు వెళ్లిపోయారు. కాబట్టి ఈ జైళ్లలో బందీలు ఒడిశాలోకి ప్రవేశించే ప్రమాదం ఎక్కువగా ఉంది. చట్టవిరుద్ధమైన ప్రవేశం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడదు. ఈ నేపథ్యంలో సాగర తీరంలో పెట్రోలింగ్‌ను పెంచినట్లు తెలిపారు.

పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటన



మోటు ప్రాంతంలో పర్యటిస్తున్న ఆమ్ జనతా ఉజాబ్ బృందం సభ్యులు

మల్కన్‌గిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్టు పూర్తయితే మల్కన్‌గిరికి ముంపు ప్రమాదం పొంచి ఉంటుందనే ఆందోళనల నేపథ్యంలో దీనిపై సమీక్షించేందుకు ఆమ్ జనతా ఉజాబ్ సంస్థ బృందం సభ్యులు మల్కన్‌గిరి మోటు ప్రాంతంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఈ బృందం సభ్యులతో కేంద్ర మాజీ మంత్రి బ్రజ్ త్రిపాఠి మాట్లాడుతూ.. ప్రాజెక్టు వలన స్థానిక ప్రజలకు ఎటువంటి నష్టాలు జరుగుతాయో వివరించారు. మోటు పరిధిలోని వినయక్‌పూర్, మోటు, అల్మా, పేట, మహారాజ్‌పల్లి తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతాయన్నారు. శబరీ నదిపై ఉన్నటువంటి వంతెన ఎత్తు తక్కువగా ఉండడంతో పంట పొలాలు నీట మునుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు పునరావాసంతో పాటు నష్ట పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. వారితో పాటు రాష్ట్ర బీజేపీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాస్‌దేవ్ భట్, జనతా దళ్ నాయకుడు మనోజ్ జెన్నా తదితరులు ఉన్నారు.

రైల్వే ట్రాక్‌పై కొండ చరియలు

- కేఆర్ లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం



రైల్వే ట్రాక్‌పై పడిన మట్టిపెళ్లలు

రాయగడ: కొరపుట్-రాయగడ (కేఆర్) రైలు మార్గంలో గురువారం ఉదయం రైళ్ల రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. ఈ మార్గంలోని కెవుటిగుడ-సికరపాయి రైల్వేస్టేషన్ల మధ్య 35వ నంబర్ టన్నల్ సమీపంలో ట్రాక్‌పై కొండ చరియలు విరిగి పడడంతో అంతరాయం ఏర్పడింది. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మట్టి కిందకు జారిపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్‌పై పడిన మట్టిపెళ్లలను తొలగించారు. దీంతో అనంతరం రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కాగా రాయగడ మీదుగా వెళ్లే సమిలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను కొద్దిసేపు కెవుటిగుడ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా రైల్వే శాఖ అధికారులు వారికి వాటర్ బాటిళ్లు, స్నాక్స్ వంటివి ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతీ వర్షాకాలంలో ఈ మార్గంలో ఇటువంటి తరహా ఘటనలు చోటు చేసుకుంటుండడం పరిపాటిగా మారింది.

ఖుర్దా డివిజన్‌లో డిజిటల్ చెల్లింపులు



ఖుర్దారోడ్ రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద క్యూఆర్ కోడ్ సౌకర్యం

భువనేశ్వర్: రైల్వే టికెట్ కొనుగోలు రంగంలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహానికి ఖుర్దారోడ్ మండలం నడుం బిగించింది. డివిజన్‌లోని అన్ని రైల్వేస్టేషన్లలో టిక్కెట్ బుకింగ్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను ఇన్‌స్టాల్ చేయడం ప్రారంభించారు. రైలు టికెట్ కొనుగోలులో ఈ చొరవ ప్రయాణికులకు నగదు చెల్లింపు ఇబ్బందులు తొలగిస్తుంది. ప్రధానంగా చిల్లర బెడద దూరమవుతుంది. ఖుర్దారోడ్ మండలం వ్యాప్తంగా అన్ని కేటగిరీల రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను ఇన్‌స్టాల్ చేస్తారు. అంచెలంచెలుగా 113 రైల్వే స్టేషన్లలో ఈ సౌకర్యం కల్పిస్తారు. డివిజన్‌లోని భువనేశ్వర్, పూరీ, ఖుర్దా రోడ్, బరంపురం, కటక్, భద్రక్, పలాస, జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్, బలుగాంవ్, సోంపేట, ఇచ్ఛాపురం, ఢెంకనాల్, తాల్చేర్, పారాదీప్, దసపల్లా మొదలైన 75 రైల్వే స్టేషన్లలో ఈ సౌకర్యం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది.

మరో వారం రోజుల్లో డివిజన్ అంతటా మిగిలిన అన్ని స్టేషన్లకు ఈ సౌకర్యం విస్తరిస్తారు. రిజర్వ్‌డ్ మరియు సాధారణ శ్రేణి టిక్కెట్లను జారీ చేసే బుకింగ్ కౌంటర్లలో ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. రైలు వినియోగదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలను కల్పించే ధ్యేయంతో ఖుర్దా రోడ్ డివిజన్ ఆధునిక సాంకేతికతను అవలంబిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.

పోలవరం ఎత్తు తగ్గించాలి

- మాజీ మంత్రి అతున్ సవ్యసాచి



వినాయక్‌పూర్‌లో పర్యటిస్తున్న బీజేడీ నాయకులు



ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

మల్కన్‌గిరి: పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కడుతున్న పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని మాజీ మంత్రి అతున్ సవ్యసాచి హెచ్చరించారు. పోలవరం వలన ముంపునకు గురయ్యే మల్కన్‌గిరి జిల్లాలో బీజేడీ నాయకుల బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కన్‌గిరి శ్రేయస్సు దృష్ట్యా బీజేడీ పార్టీ పోలవరానికి మొదటి నుంచి వ్యతిరేకంగానే ఉందని గుర్తు చేశారు. దీనికోసం తాము అధికారంలో ఉన్నప్పుడు అఖిల పక్ష కమిటీ కూడా పర్యటించిందన్నారు. ముంపు ప్రాంతాలైన బరిభంచ్, వినాయక్‌పూర్, ముగిపోయింటన, మురళీగూడ, కొత్తగూడ, అల్మా, రెడ్డీపాల్, కమలాపూర్, పుషుగూడ, మల్కన్‌పల్లి, పేట గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. పోలవరం వలన రాష్ట్రంలోని 5 వేల హెక్టార్ల రక్షిత అటవీ భూమి, 10 వేల హెక్టార్ల వ్యవసాయ భూమి ముంపునకు గురవుతాయన్నారు. పర్యటనలో నవరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేష్ మాఝి, మాజీమంత్రి రబినారాయణ్ నందో, ఈశ్వర్ పాణిగ్రాహి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానస్ మడ్కమి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దిశా డీఎస్పీ స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ముందు శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వచ్చిన రుప్పా శ్రీనివాసరావును బదిలీ చేస్తున్నట్లు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం అర్ధరాత్రి దాటాక ఉత్తర్వులు వచ్చాయి. ఈయన ఒంగోలు ఎస్డీపీఓగా (డీఎస్పీగా) వెళ్లనున్నారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. చేసే కొద్ది కాలంలో సహకరించిన సిబ్బందికి, ఎస్పీకి డీఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులపై కేసులు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని వాంబే కాలనీ, దమ్మలవీధి, కంపోస్టు కాలనీ, హయాతీనగర్, 80 ఫీట్ మార్గంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించే వారిపై బుధవారం రాత్రి ఒకటో పట్టణ పోలీసులు ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 25 మంది పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు.

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

మెళియాపుట్టి: ఓ భారీ కొండచిలువను మండల కేంద్రంలోని కూన అప్పలరాజు ఇంటికి సమీపంలో యువకులు హతమార్చారు. గురువారం ఉదయం కోళ్ల గూడులో శబ్దాలు రావడంతో వెళ్లి చూడగా ఓ భారీ కొండచిలువ ఉండటంతో భయభ్రాంతులకు గురయ్యారు. అయితే అప్పలరాజుకు చెందిన నాలుగు నాటు కోళ్లను కొండ చిలువ మింగేసి కదలలేని స్థితిలో ఉండడంతో పలువురు యువకులు దాన్ని బయటకు తీసి హతమార్చారు.

వయనాడ్ బాధితులకు బైపల్లి భారీ విరాళం

టెక్కలి రూరల్: ప్రకృతి విలయానికి అతలాకుతలమైన కేరళలోని వయనాడ్ బాధితులకు టెక్కలి నియోజకవర్గ జై భారత్ నేషనల్ పార్టీ ఇన్‌చార్జ్ బైపల్లి పరమేశ్వరరావు రూ.లక్ష అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మన వంతు సాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి తన వంతు సాయం చేశానని తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు తాళ్లభద్ర గ్రామం సుమ్మాదేవి రైల్వే స్టేషన్‌ల మార్గ మధ్యంలో రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పలాస జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. రైలు ప్రమాదంలో చనిపోయి ఉంటాడని వారు చెబుతున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఒలింపిక్స్ విజేతలను ఆదర్శంగా తీసుకోండి'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి

సారవకోట: విద్యార్థులు ఒలింపిక్స్ విజేతలను ఆదర్శంగా తీసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఒలింపిక్స్‌లో విజేతలుగా నిలిచిన వారి జీవితాల గురించి విద్యార్థులకు వివరించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, వసతి గృహం పరిసరాలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులను సూచించారు.

ప్రముఖ కళాకారుడు చిన్నయాచారి మాస్టారు మృతి

పొందూరు: ప్రముఖ రంగస్థల కళాకారుడు, 65 ఏళ్ల నాటకరంగానికి సేవలందించిన సింహాద్రి చిన్నయాచారి మాస్టారు గురువారం ఉదయం మృతి చెందారు. పొందూరుకు చెందిన చిన్నయచారి మాస్టారు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే కళారంగానికి సేవలందించారు. హార్మోనీ వాద్య కళాకారుడుగా, మేకప్ ఆర్టిస్టుగా విలువైన సేవలందించారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పొందూరులోని తన స్వగృహంలో గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు వందలాదిగా విద్యార్థులు, కళాకారులు తరలివచ్చారు. ఆయన మృతిపై కళాకారుల సంఘం ప్రతినిధులు వి.మురళీమోహన్, బీ.శ్రీనివాసం, కె.శాంతారాం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కొత్త మద్యం దుకాణాలు తెరిచేది లేదు

- మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



భువనేశ్వర్: రాష్ట్రంలో ఇకపై కొత్త మద్యం దుకాణాలు తెరవబోమని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ గురువారం తెలిపారు. వచ్చే ఏడాది కొత్త ఎక్సైజ్ విధానం ప్రవేశ పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మద్యం అక్రమ విక్రయాలపై కఠినంగా వ్యవహరించే లక్ష్యంతో కార్యాచరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అబ్కారీ విభాగం ఇతర అనుబంధ శాఖలతో సంప్రదింపుల తర్వాత మద్యం నిషేధం విధించే సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం అన్వేషిస్తుందని సామాజిక భద్రతా మంత్రి నిత్యానంద గోండ్ తెలిపారు.

ఆదాయం లోటు భర్తీ ఎలా..?

రాష్ట్రంలో మద్యం నిషేధిస్తామని ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీ ప్రజలకు హామీ ఇచ్చింది. అయితే వాస్తవ కార్యాచరణలో పలు సమస్యలు తలెత్తే పరిణామాలను అనుబంధ వర్గాలు వేలెత్తి చూపుతున్నాయి. హామీ నిలబెట్టుకునేందుకు అడ్డంకులను అధిగమించే ప్రత్యామ్నాయ మార్గం ఇంతవరకు ఖరారు కానట్లు సమాచారం.

100 రోజుల ప్రభుత్వ పాలన సాఫల్యత చాటుకునేందుకు రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తుంది. మరో వైపు బలమైన విపక్షంగా బిజూ జనతా దళ్ అనుక్షణం ప్రతి కదలికని లోతుగా పసి గడుతోంది. లోపాలను బహిరంగంగా ఎండగడుతోంది. దీంతో నిషేధంపై మీమాంస నెలకొంది.

రాష్ట్ర ప్రభుత్వం సొంత వనరుల ఆదాయంలో మద్యం అమ్మకాల నుంచి దాదాపు 15 శాతం లభిస్తుంది. ఇటీవల కాలంలో రాష్ట్ర అబ్కారీ శాఖ ఆదాయం వివరాలు పరిశీలిస్తే...

ఆర్థిక సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2020-21	4,053.51
2021-22	5,528.00
2022-23	6,455.00
2023-24	7,800.00

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థి

జయపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో సమితిలోని మచ్చర ఆదర్శ పాఠశాల విద్యార్థులు, జయపురం అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పోటీలను స్థానిక విక్రమదేవ్ యూనివర్సిటీ బీఈడీ విద్యార్థులు గురువారం నిర్వహించారు. ప్రొఫెసర్ డా.మనోరంజన్ ప్రధాన్, ఆదర్శ విద్యాలయ ప్రిన్సిపాల్ శశాంక చౌదరి, ఉపాధ్యాయులు రామచంద్ర కంప పర్యవేక్షణలో వక్తృత్వ, క్విజ్, నృత్య పోటీలను చేపట్టారు. వక్తృత్వ పోటీల్లో సౌమ్యరంజన్ సాగర్ ప్రథమ, అభిషేక్ పండ ద్వితీయ, స్వస్తిక సెట్టి తృతీయ స్థానాల్లో నిలిచారు. నృత్య ప్రదర్శన పోటీల్లో అస్మిత టీమ్ ప్రథమ స్థానం, ఎ.నిహారిక ద్వితీయ, తరణి గ్రూపు తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే క్విజ్ పోటీల్లో ఓమ్ ప్రతిక్ దాస్ ప్రథమ స్థానం పొందగా, స్వస్తిక్ సెట్టి ద్వితీయ, విష్ణు బెహర తృతీయ స్థానాలు పొందారు. అలాగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో 13 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ శశాంక చౌదరి, ప్రొఫెసర్ డా.మనోరంజన్ ప్రధాన్‌లు బహుమతులు అందజేశారు.



హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు నమూన



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థిని

ఉన్నత పాఠశాల సందర్శన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి గురువారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన భవనాలను పరిశీలించారు. అనంతర పాఠశాల గ్రంథాలయానికి వెళ్లి, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ఈ పాఠశాలను తాను దత్తత తీసుకున్నానని, అందువలన సందర్శనకు వెళ్లినట్లు పేర్కొన్నారు. పాఠశాల సమస్యలపై హెచ్ఎంతో చర్చించారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను జిల్లాలోని గుణుపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రెండు బ్యాగుల్లోని 76 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో బిహార్‌కు చెందిన మహేంద్ర చౌదరి, అభిషేక్ కుమార్‌లు ఉన్నట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు బుధవారం తరలించారు. గుణుపూర్ పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని అందిన సమాచారం మేరకు పోలీసులు గుణుపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా మహేంద్ర, అభిషేక్‌లు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది.

స్వాతంత్య్ర దినోత్సవాల సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: బొరిగుమ్మ సమితిలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశం గురువారం జరిగింది. సమితి సభా గృహంలో బొరిగుమ్మ సమితి చైర్‌పర్సన్ దీప్తిమయి నాయిక్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతిఏటా మాదిరిగానే బొరిగుమ్మ మినీ స్టేడియంలో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. బీడీవో సంధ్యా సోమరథ్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. సమావేశంలో బొరిగుమ్మ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగరాజు దొర, సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ గంతాయిత్, ఏబీడీవో మాధురి ఆచారి, ఏఈఈ ప్రకాశ్ ప్రధాన్, బీఎస్ఎస్‌వో చంద్రిక కండెంగెల్, సంక్షేమ అధికారి సోనాలి నాయిక్, సివిల్ సప్లయ్ అధికారి బిశ్వజిత్ దాస్, బీఈవో సచిన్ కుమార్ మల్లిక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ క్రీడాకారులను వెలికితీద్దాం'



మాట్లాడుతున్న భాస్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తమ క్రీడాకారుల వెలికి తీత లక్ష్యంగా ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎ.భాస్కర్ అన్నారు. వర్సిటీ పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో గురువారం స్పోర్ట్స్ బోర్డు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సు కళాశాలలో క్రీడాకారులను గుర్తించాలని అన్నారు. క్రీడాంశాల వారీగా వారిని ప్రోత్సహించాలని చెప్పారు. అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని చెప్పారు. జిల్లాలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాక్సింగ్, అథ్లెట్ వంటి అంశాల్లో మెరుగైన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు మధు, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



దుండగులు పగలుగొట్టిన హుండీ



మా మార్కమ అమ్మవారు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో ఉన్నటువంటి మా మార్కమ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు అమ్మవారి మందిరంలోకి చొరబడి ఆవరణలో ఉన్నటువంటి హుండీని విరగొట్టారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు, నగదు తీసుకెళ్లారు. మందిరం గర్భగుడి తాళాలను విరిచిన దుండగులు అమ్మవారికి ఇత్తడితో రూపొందించిన ఆభరణాలను సైతం దొంగిలించారు. మందిరంలో చొరబడిన దుండగులు అమ్మవారి మందిరంలో సీసీ కెమెరాలకు చెందిన హార్డ్ డిస్కులు సైతం పట్టుకెళ్లిపోయారు. గురువారం తెల్లవారుజామున బిసంకటక్‌కు చెందిన ఒక వ్యక్తి అమ్మవారి మందిరం వద్ద పూలు కోసేందుకు వెళ్లిన సమయంలో హుండీ విరిగిపడి ఉండడం గమనించి వెంటనే మందిరం అర్చకుడికి సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న పూజారి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు, క్లూస్ టీమ్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది నెలల క్రితం ఇదే మందిరంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఆ కేసుకు సంబంధించి ఇంతవరకు నిందితులు దొరక్కముందే మరో దొంగతనం జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉప ముఖ్యమంత్రికి హైకోర్టు నోటీసులు

భువనేశ్వర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్‌కు రాష్ట్ర హైకోర్టు గురువారం తాఖీదు జారీ చేసింది. ఈనెల 30వ తేదీలోగా వివరణ దాఖలు చేయాలని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 30వ తేదీకి వాయిదా వేసింది. ఎన్నికలు పురస్కరించుకుని ఆస్తుల వివరాల తప్పుడు సమాచారంతో అఫిడవిట్ దాఖలు చేసినట్లు తన సమీప ప్రత్యర్థి, బీజేడీ అభ్యర్థి సరోజ్ మెహర్ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా హైకోర్టు ఈ తాఖీదులు జారీ చేసింది.


హెటాబాగ్‌ను చంపిన గ్రామస్తులు



సంచరించిన హెటాబాగ్(ఫైల్)

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి కొణాగాం గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన హెటా బాగ్‌ను ప్రజలు కొట్టి చంపారని ఫారెస్టు రేంజర్ డొంబురు దొర గొమాంగో గురువారం వెల్లడించారు. దీంతో దానిని దహనం చేసినట్లు పేర్కొన్నారు. హెటా బాగ్‌ను ఎవరు కొట్టి చంపారో తమ వద్ద ఎటువంటి ఆధారాలు లేవన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృత సమానం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: తల్లిపాలు బిడ్డలకు అమృత సమానమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక పితామహల్‌లోని సెంచురియన్ విశ్వవిద్యాలయంలో నర్సింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. అందరికీ అవగాహన కలిగేలా గీసిన చిత్రాల ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు.

ఆహార ధాన్యాల ఏటీఎం ప్రారంభం



మంచేశ్వర్‌లో ప్రారంభమైన ఏటీఎం

భువనేశ్వర్: రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో స్థానిక మంచేశ్వర్‌లో ఆహార ధాన్యాల ఏటీఎం 'అన్నపూర్తి'ని గురువారం ప్రారంభించారు. ఈ ఏటీఎంలో బియ్యం, గోధుమలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. చౌక ధరల బియ్యం పంపిణీలో అక్రమాల నివారణకు ఆహార ధాన్యం ఏటీఎం దోహదపడుతుందని విభాగం మంత్రి కృష్ణచంద్ర పాత్రో ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రయోగాత్మకంగా ఈ ఏటీఎం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇది విజయవంతంగా పనిచేస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆహార ధాన్యాల ఏటీఎం సౌకర్యం ద్వారా ఒకేసారి 25 కిలోల బియ్యం, గోధుమలు కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

పనితీరు ఇలా...

ఆహార ధాన్యాల ఏటీఎం వినియోగించేందుకు లబ్ధిదారులు రేషన్ కార్డ్ నంబర్‌ను టచ్ స్క్రీన్ డిస్‌ప్లే మానిటర్‌పై నమోదు చేయాలి. రేషన్ కార్డులో పేర్కొన్న కుటుంబ సభ్యుల బయోమెట్రిక్ ప్రామాణికరణతో స్వల్పంగా 35 సెకన్లలో 25 కిలోల బియ్యం, గోధుమలు ఏటీఎం పంపిణీ చేస్తుంది. అత్యధికంగా ఒక నిమిషం వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. ఒక్కో ఏటీఎం గరిష్ఠ సమర్థత 2 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు. బియ్యం సేకరణ కోసం ఏటీఎంకు గోనె సంచి జోడిస్తే బియ్యం, గోధుమలతో నిండుతుంది. ఇలా ఆహార ధాన్యాలు పొందడంలో లబ్ధిదారునికి ఏదైనా సమస్య ఎదురైతే హెల్ప్‌లైన్ డెస్క్ నంబర్‌కు కాల్ చేయవచ్చు. ఒకటి లేదా రెండు రోజుల్లో సమస్య పరిష్కరించబడుతుంది. వినియోగదారులకు సహాయం చేయడానికి ఒక ఆపరేటర్ మరియు ఇన్‌చార్జిని ఏటీఎం కేంద్రంలో నియమిస్తారు. ఈ వ్యవస్థ చౌక ధరల దుకాణం వ్యవస్థకు ప్రత్యామ్నాయమని అనుబంధ వర్గాలు తెలిపాయి.

పర్లాకిమిడిలో హ్యాక్‌థాన్ పోటీలు



పోటీలను తిలకిస్తున్న డీఈవో మాయాధర్ సాహు

పర్లాకిమిడి: స్థానిక మహిళా ప్లస్ టూ విద్యాలయంలో జిల్లాస్థాయి హ్యాక్‌థాన్ పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా ముఖ్య శిక్షాధికారి మాయాధర్ సాహు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 27 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిలో శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలకు చెందిన విద్యార్థి అమరేంద్ర బిస్వాల్, ఒడిశా ఆదర్శ విద్యాలయం (అల్లడ) విద్యార్థి కిసాన్ కుమార్, మహిళా ఉన్నత విద్యాలయం విద్యార్థిని శమదర్శినీ పాణిగ్రాహిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ,



పోటీలను తిలకిస్తున్న ఒడిశా యునివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధన విభాగం అధ్యాపకులు

రీసెర్చ్ విద్యార్థి అభిషేక్ పాత్రో, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ అంపోలు రవికుమార్, నరేష్ పట్నాయక్, నిబేదితా మఝి, ఎ.మురళీకృష్ణ, ఐ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

డిప్యూటేషన్‌పై పాఠశాలకు ఉపాధ్యాయులు



ఇరిగేషన్ కాలనీ ఉన్నత పాఠశాల



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్

జయపురం: పట్టణంలోని ఇరిగేషన్ కాలనీలో ఉన్నటువంటి ప్రాజెక్టు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు సెలవులపై వెళ్లడంతో మూడు రోజులు పాఠశాల మూసివేస్తూ యాజమాన్యం సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై స్పందించిన జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి వెంటనే ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. బీఈవో ఆదేశం మేరకు కుందారిగుడ పాఠశాల నుంచి గీతారాణి పాఢి, దొరగుడ అప్‌గ్రేడ్ పాఠశాల నుంచి చినప ముగ్గపలు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

చేపల చెరువుపై విష ప్రయోగం



విషం కలపడం వల్ల చనిపోయిన చేపలు

జి.సిగడాం: మండలం చంద్రయ్యపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కోరాడ వాణిశ్రీ కుమారుడు కోరాడ వెంకటేష్ చేపల చెరువులో విష ప్రయోగం జరిగింది. బాధితుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పంచాయతీ ద్వారా చెరువు వేలం వేయగా.. వెంకటేష్ రూ.40వేలకు పాట పాడారు. ఈ చెరువులో మే నెలలో రూ.2.50 లక్షల విలువ చేసే చేపలను కొనుగోలు చేసి పెంచడానికి వేశారు. అయితే ఈ నెల 7న గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో చేపలు మరణించడానికి విషం కలిపారని వెంకటేష్ తెలిపారు.

దీని ప్రభావం వల్ల చేపలన్నీ చనిపోయాయని, వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు.

ఘనంగా శ్రావణ చవితి వేడుకలు



పుట్టవద్ద పాలు పోసి పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు శ్రావణ మాసంలో వచ్చే నాగుల చవితిని రెండురోజుల పాటు భక్తితో నిర్వహిస్తారు. గురువారం చవితి సందర్భంగా కుటుంబాలతో కలసి టౌన్‌హాలు వద్దనున్న పుట్ట వద్దకు వచ్చి రెండురోజుల పాటు నిర్వహించే ఉపవాసాలను విరమించుకున్నారు. స్వామి ప్రసాదాన్ని అందరూ స్వీకరించారు. కార్యక్రమంలో రంగ్రీజీ సభ్యులు భిమాజీరావు, సెక్రటరీ బాలజీ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సరిహద్దులో అప్రమత్తం

● ఎస్పీ మాధవరెడ్డి



నేరడి-బి నదీతీరంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

భామిని: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ మాధవ రెడ్డి సూచనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి గురువారం ఆకస్మికంగా భామిని మండలాన్ని సందర్శించి సరిహద్దు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ముందుగా బత్తిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసి ఇటీవల నమోదైన కేసులపై ఎస్సై సీహెచ్.ప్రసాద్‌కు సూచనలు చేశారు.ఆంధ్ర-ఒడిశా మధ్య ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు, అనంతరం వంశదార నదీ తీర ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. నేరడి -బి వద్ద వంశధార నదీ తీరంలో అతి కష్టం మీద నిలుచుని నదీ ఆవల గల ఒడిశా గ్రామాలను చూశారు. నదిలో వచ్చే వరదలపై స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ప్రస్తుతం ఒడిశా నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహంపై ఆరా తీశారు. వంశధార నదిలో నీరు నిండుగా ఉన్నందున తీరంలో ఇసుక లభ్యత ఎలా సాధ్యపడుతున్నదని వాకబు చేశారు. బత్తిలి ఎస్సై సీహెచ్.ప్రసాద్, సిబ్బంది కార్యక్రమంలో ఉన్నారు.

గిరిజనుల హక్కులు కాపాడాలి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి

కొమరాడ: ఆదివాసీ, గిరిజనుల హక్కులు కాపాడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లు సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కొమరాడ మండలంలోని అంటివలస గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారినా..దశాబ్దాలు గడుస్తున్నా అనేక గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం తదితర కనీసం మౌలిక సదుపాయాలు లేక డోలీ మోతలతోనే వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రపంచంలో 40 కోట్ల ఆదివాసీ జనాభాకోసం 1994వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి అగస్టు 9 తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. గిరిజనులకు ఎంతో మేలు చేసే 1/70చట్టం కచ్చితంగా అమలు చేయాలని జనాభా ప్రాతిపదికన 8.3 శాతం నిధులు గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించి గిరిజనులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బడ్డీని ఢీకొట్టిన బొలెరో



బొలెరో ఢీకొట్టిన టిఫిన్‌బడ్డీ

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని ప్రదీప్‌నగర్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ బడ్డీని గురువారం ఉదయం బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో టిఫిన్ బడ్డీ నుజ్జు నుజ్జు అయినప్పటికీ బడ్డీలో ఉన్న గ్యాస్ సిలిండర్ వల్ల ఎటువంటి అగ్ని ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాత్రంతా నిద్రలేకుండా ఉన్న డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

పురుగు మందు తాగి ఆత్మహత్య

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలసకు చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నడగాన సురేష్ (24) జూలై నెల 24వ తేదీన తన ఇంటిలోపల ఇనుప చువ్వలకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మరువక అతని తండ్రి నడగాన రమణ (55) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. రోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో తండ్రీకొడుకులు బలవన్మరణం చెందడంతో దిక్కులేనివారమయ్యామని కుటుంబసభ్యులు రోదిస్తుంటే గ్రామస్తుల కళ్లు చెమర్చాయి. కుమారుడు చనిపోయిన నాటి నుంచి మనస్తాపానికి గురైన రమణ సరిగా అన్నం భోజనం చేయకుండా పరామర్శకు వస్తున్న బంధువుల వద్ద ఏడుస్తూ అనారోగ్య బారిన పడ్డాడు. చేతికి అందొచ్చిన కొడుకు చనిపోయాడనే బాధతోనే పురుగుమందు తాగేశాడని భార్య జానకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

117 ఉత్తర్వులు రద్దుచేయాలి

పార్వతీపురంటౌన్: ప్రాథమిక పాఠశాలను విధ్వంసం చేస్తున్న జీఓనంబర్ 117ను రద్దుచేసిన తరువాత మాత్రమే ఉపాధ్యాయుల పనిని సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ కోరారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా ఆ ఖాళీలను భర్తీచేయాలని కోరారు.

భళా బీఎస్ఎన్ఎల్

● మారుమూల ప్రాంతాల్లోకి విస్తరిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ
● ప్రైవేట్ టెలికం కంపెనీల బాదుడుతో బీఎస్ఎన్ఎల్ వైపు వినియోగదారుల మొగ్గు
● సుమారు 3 లక్షలకు చేరిన ప్రీపెయిడ్ వినియోగదారులు
● విస్తరణపై దృష్టిపెట్టిన బీఎస్ఎన్ఎల్
● మరో 57 కొత్త ప్రాంతాల్లో టవర్ల నిర్మాణ పనులు
● ఉమ్మడి విజయనగరం జిల్లాలో 16 ఎక్స్ఛేంజీల పరిధిలో 270 టవర్లతో సేవలు
● మన్యంలోనూ 70 టవర్ల ఏర్పాటు
● గతేడాది వర్చువల్‌గా ప్రారంభించిన నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి



సెల్‌సిగ్నల్ వస్తున్న ఆనందంలో గిరిజనులతో గత కలెక్టర్ నిషాంత్‌కుమార్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)... మళ్లీ పూర్వవైభవం వైపు అడుగులేస్తోంది. ప్రైవేట్ టెలికం సంస్థలు ఇష్టానుసారంగా టారిఫ్ పెంచేస్తుంటే ఆ బాదుడు భరించలేక వినియోగదారులు ప్రత్యామ్నాయంగా మళ్లీ బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థపై ఆధిపత్యం కోసం రకరకాల ఆఫర్లతో ఆకర్షించిన జియో, ఎయిర్‌టెల్, వొడా తదితర టెలికం సంస్థలు డేటా చార్జీలను అమాంతంగా పెంచేశాయి. సామాన్యులకు కూడా తప్పనిసరి వస్తువుగా మారిన మొబైల్ ఫోన్ ప్రతి ఇంటిలో సాధారణమైపోయింది. ఇదే అదనుగా ప్రైవేట్ సంస్థలు మార్కెట్‌లో ఏకఛత్రాధిపత్యం చలాయిస్తున్నాయి. వాటి దెబ్బకు కుదేలైపోయిందనుకున్న బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు మళ్లీ పడిలేచిన కెరటంలా దూసుకెళ్తోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో బీఎస్ఎన్ఎల్ పరిపాలన వ్యవహారాలన్నీ విజయనగరంలోని కార్యాలయం నుంచే నడుస్తున్నాయి. గత నెలలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 3,300 మంది, శ్రీకాకుళం జిల్లాలో 3,500 మంది వరకూ పోర్టబులిటీ సౌకర్యంతో మార్చుకున్నారు. ఒకప్పుడు నెలకు 500 మంది మారితే గొప్పగా ఉండేది. కానీ ఇప్పుడు ఒక్కసారిగా మూడువేల మందికి పైగా మార్పు చేసుకుంటుండటంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు తమ సేవలను మరింత విస్తృతం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. గత నెలలో 4,500 సిమ్ కార్డులును విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వినియోగదారులు కొనుగోలు చేశారు.

4జీ సేవలపై ప్రధానంగా దృష్టి

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను విస్తృతం చేయడంపై దృష్టి సారించింది. ఇప్పటివరకూ పాత బ్యాటరీలతో నడిచే టవర్ల స్థానంలో కొత్తవి ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందినీ నియమించారు. విజయనగరం జిల్లా కేంద్రంలోనే 56 ఫోర్‌జీ టవర్లు పనిచేస్తున్నాయి. వీటన్నింటికీ కోర్ ఎక్విప్‌మెంట్ అనుసంధానం చేస్తున్నారు.

మారుమూల ప్రాంతాలకు సైతం

విజయనగరం జిల్లాలో మారుమూల ప్రాంతాలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలకు సైతం బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాయి. కొండలపైన, గిరిజన తండాల్లోనూ, ఒడిశా సరిహద్దు ప్రాంతాల వరకూ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో డిజిటల్ విప్లవానికి గత ఏడాది జూన్‌లో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. సెల్ నెట్‌వర్క్‌లేని గ్రామాలను, గిరిజన ఆవాసాలను ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించి రూ.135 కోట్ల వ్యయంతో 181 సెల్ టవర్లు ఏర్పాటు చేయించారు. వాటిలో 70 టవర్లు బీఎస్ఎన్ఎల్‌వే. ప్రైవేట్ సంస్థలైన జియో 75, ఎయిర్‌టెల్ 36 టవర్లు పెట్టాయి. నెట్‌వర్క్ పెరగడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌కు సమాచారం సత్వరమే చేరుతోంది. గిరిజన మారుమూల ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాల్లో సేవలు మెరుగయ్యాయి. మరోవైపు నాటుసారా విక్రయాలు, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయడానికి, అక్రమ వ్యాపారాలపై పోలీసులకు సమాచారం ఇవ్వడానికి నెట్‌వర్క్ ఉపయోగపడుతోంది. ఈ సేవలను నీతి అయోగ్ కూడా ప్రశంసించింది.

రుసుముల్లో చాలా వ్యత్యాసం

జియో, ఎయిర్ టెల్ తదితర ప్రైవేట్ టెలికం కంపెనీలు రీచార్జ్ రేట్లు భారీగా పెంచేశాయి. రూ.248గా ఉన్న రీచార్జి రుసుం ఒకేసారి రూ.299కి పెరిగింది. నెలరోజుల వ్యాలిడిటీ కాకుండా కేవలం 28 రోజులకే పరిమితం చేస్తున్నాయి. అదే బీఎస్ఎన్ఎల్ నెలకు రూ.197 మాత్రమే చార్జి చేస్తోంది. వాయిస్ కాల్స్, ఇంటర్నెట్ డేటా రుసుం సైతం అమాంతంగా పెంచేయడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపిస్తున్నారు.



విజయనగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం

పూర్వవైభవం తప్పక వస్తుంది



వినియోగదారుల ఆదరణతో బీఎస్ఎన్ఎల్ మళ్లీ పూర్వవైభవం సంతరించుకుంటుంది. ప్రైవేట్ ఆపరేటర్ల తీరుతో ప్రజలు విసిగిపోయారు. వాటికి భిన్నంగా బీఎస్ఎన్ఎల్ తనదైన శైలిలో మొదటి నుంచి సేవలందిస్తూనే వస్తోంది. ప్రస్తుతం నెలకు మూడు నుంచి నాలుగువేల మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కి మారుతున్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా 4 జీ, ఇంటర్‌నెట్, ఫైబర్, ల్యాండ్‌లైన్ తదితర సేవలపై పూర్తిస్థాయిలో దృష్టిపెడుతున్నాం. సెల్‌టవర్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాం.

– దాలినాయుడు, డిప్యూటీ జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, విజయనగరం

మెరుగైన సేవలు అందుతున్నాయి



ప్రైవేటు నెట్‌వర్క్ సేవల రీచార్జ్ ప్లాన్‌ల రుసుం అమాంతంగా పెంచేశారు. అంత మొత్తంలో చెల్లించి రీచార్జ్ చేయించుకోవాలంటేనే భయం వేస్తోంది. కనుకనే తక్కువ రీచార్జ్ ప్లాన్ కలిగిన బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి మారిపోయాను. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి ఆటంకం లేకుండా నెట్‌వర్క్ సేవలు మెరుగ్గా అందుతున్నాయి.

– చోడి ఆనంద్, పూడేసు గ్రామం, కొమరాడ మండలం

BSNL



పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెల్ టవర్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్

బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు:	16		
ల్యాండ్ లైన్ కనెక్షన్లు:	1500		
ప్రీపెయిడ్ వినియోగదారులు:	3 లక్షలు		
ఫైబర్ కనెక్షన్లు :	6,500	లీజ్డ్ కనెక్షన్లు:	500
ప్రస్తుతం ఉన్న టవర్లు :	270	నిర్మాణంలో ఉన్న టవర్లు :	57
తాజాగా పోర్టబులిటీలో బీఎస్ఎన్ఎల్‌కు మారినవారి సంఖ్య:	3,300		

గంజాయి, సారా నిర్మూలనకు విస్తృతంగా దాడులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి, సారా నియంత్రణకు కఠినచర్యలు చేపట్టి వాటి నిర్మూలనకు విస్తృతంగా దాడులు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన ఎస్ఈబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో గంజాయి, సారా ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కఠినచర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రత్యేక దృష్టిసారించి నిఘా ఏర్పాటు చేసుయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సారా తయారీ, అమ్మకాలకు పాల్పడే నిందితులను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అటువంటి వారిపై బైండోవర్ కేసులు నమోదుచేయాలని తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీ, గంజాయి అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో బెల్లం ఊటలను గుర్తించి, ధ్వంసం చేసే కేసుల్లో నిందితులను గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని, దర్యాప్తులో ఉన్న కేసుల్లో నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తిచేసి, కోర్టులో నిందితులపై అభియోగపత్రాలను దాఖలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌లు, ఇతర ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానానికి.. ‘మేము సైతం’



● నేటి నుంచి రక్తదాన ఉద్యమం పేరిట జిల్లాలో శిబిరాలు
● రక్త కొరతను తీర్చడమే లక్ష్యం
● ప్రతిరోజూ కనీసం 50 యూనిట్ల సేకరణ



సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లా యంత్రాంగం రక్తదాన ఉద్యమం చేపట్టింది. ‘మేము సైతం’ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శ్రీకారం చుట్టారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక, జిల్లాలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తహీనత అధికంగా ఉన్న మన్యం జిల్లాలో మాతాశిశు మరణాలు అనేకం సంభవిస్తున్నాయి. గిరిజనులకు దాతలను తీసుకొచ్చే అవగాహన, సమయం కూడా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని, స్థానికంగా రక్త కొరతను నివారించడం.. రక్తదానం ప్రాముఖ్యత, ప్రాణాలను రక్షించడంలో దాని ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడం, జిల్లాలో సాధారణ రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యంగా ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లో శిబిరాలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లాలో 50 రోజుల వ్యవధిలో మొదటి దశ పూర్తవుతుంది. వారం నుంచి పది రోజుల వ్యవధిలో మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రక్త దాతగా నమోదు చేసుకోవడానికి వెబ్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో శిబిరంలో కనీసం 50 యూనిట్లు సేకరించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది.

నేటి నుంచి ప్రారంభం

ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ నిశ్చయించారు. ‘జిల్లాలో రక్తం కొరత ఉంది. ప్రత్యేకించి ప్రసవాలు, ప్రమాదాల సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రక్తాన్ని సేకరించేందుకు, అన్ని బ్లడ్ గ్రూపుల లభ్యతను చూడటానికి ‘‘మేము సైతం’’ ప్రారంభిస్తున్నాం. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు) నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాకు సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక నోడల్ అధికారిగా ఉంటార’ని కలెక్టర్ తెలిపారు.

శిబిరాల షెడ్యూల్ ఇదీ..

పార్వతీపురంలో ఆగస్టు 9న కార్యక్రమం ప్రారంభోత్సవం, 12న గుమ్మలక్ష్మీపురంలో, 26న కురుపాం, సెప్టెంబర్ 5న పాలకొండ, 15న సీతంపేట, 28న పాచిపెంట, అక్టోబర్ 2న వీరఘట్టం, 12వ తేదీన జియ్యమ్మవలస, 22న సీతానగరం, నవంబర్ 2న బలిజిపేట, 14న సాలూరు, 26న భామినిలో తొలి దశలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

● ఏఎస్పీ సునీల్

సాలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న 87.29 కేజీల గంజాయిని సాలూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ సునీల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ హుగ్లీ ప్రాంతం నౌపూర్ గ్రామానికి చెందిన బలంధర్ సింగ్ (42) ఒడిశా నుంచి సాలూరు మండలం మీదుగా గంజాయిని బీహార్ తరలిస్తున్నాడని అందిని ముందస్తు సమాచారం మేరకు సాలూరు రూరల్ పోలీసులు మండలంలోని బాగువలస గ్రామం వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. వాహన డ్రైవర్ బలంధర్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని గంజాయిని. ఒక సెల్‌ఫోన్ రూ.15000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందుతుడిని విచారణ చేయగా మరో నిందితుడు ఉన్నట్లు తేలిందని ఆ నిందితుడిని కూడా పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చేపట్టారని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సునీల్

సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి త్వరగా పూర్తిచేయాలి

● జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మించాలి
● ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ డిమాండ్



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులతో మాట్లాడుతున్న అజశర్మ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సర్కారు ఆస్పత్రి అధ్వానంగా ఉందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని సందర్శించారు. సిబ్బంది, వైద్యులు, ఆస్పత్రి స్థితిగతులపై ఆరా తీశారు. మెడికల్ సూపరింటెండెంట్ బి.వాగ్దేవిని కలిసి చర్చించారు. పేదలకు అందించే వైద్యం సక్రమంగా నిర్వహించాలని కోరారు. కేంద్ర ఆస్పత్రిగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా అందుబాటులో లేని వైద్య సదుపాయాలపై మండిపడ్డారు. రోగుల సంఖ్యకు తగినట్లుగా మంచాలు లేకపోవడం, పారిశుద్ధ్య లోపం, పెచ్చులు ఊడిన గదులు, కిటికీలు, వృథా పోతున్న నీరు ఇలా ఆస్పత్రిలో పరిస్థితులన్నీ అధ్వానంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత కూడా ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా గైనిక్, న్యూరాలజీ, కార్డియాలజిస్టులను నియమించాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాల ప్రతిపాదన అమలు చేయాలని, దీనికి సంబంధించి స్థల పరిశీలన చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ నాయకుడు కె.రాజు, సీఐటీయూ నాయకుడు పి సూరిబాబు తదితరులున్నారు.

కురుపాంలో..

గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రిలో మౌలికవసతులతో పాటు వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచి ప్రజలకు వైద్యసేవలు సంపూర్ణంగా అందేలా చూడాలి. కానీ అరకొరగా వైద్య సేవలు అందించడం ప్రభుత్వానికి తగదని ఉత్తరాంధ్రా అభివృద్ధి ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కురుపాం మండల కేంద్రంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మలేరియా, టైఫాయిడ్, జ్వరాలతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో గల ఓపీ, బ్లడ్‌బ్యాంకు, ల్యాబ్, రోగులకు అందుతున్న మెనూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణితో మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఎక్కువ మలేరియాతో బాధపడుతున్నారని, కురుపాం ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు లేక ఒక్కో బెడ్‌పై ఇద్దరు ముగ్గురు రోగులు వైద్యం పొందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో 50 పడకల నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడం, గైనకాలజిస్ట్ ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్ లేకపోవడం, 12 మంది వైద్య అధికారులకు ఆరుగురే ఉండడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆస్పత్రులపై దృష్టి సారించాలని హితవుపలికారు.

కొమ్మా ఉయ్యాలా.. కోనా జంపాలా..

● నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
● పార్వతీపురంతో పాటు, సీతంపేటలో వేడుకల నిర్వహణకు సన్నాహాలు





అడవి తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, పీవో, గిరిజన సంఘ నాయకులు, అడవి తల్లికి పూజలు చేసేందుకు వస్తున్న పీఓ మాధవన్

సాక్షి, పార్వతీపురం మన్యం:

అడవి పుత్రుల జనాభా అధికంగా ఉండే జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా చేపడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ ఆవరణలోనూ ఉత్సవాలు జరిపేందుకు అక్కడి అధికారులు నిర్ణయించారు.

సంప్రదాయం ఉట్టిపడేలా..

గిరిజనుల ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటల ప్రదర్శనతోపాటు.. వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గిరిజన పెద్దలకు సత్కారం చేయనున్నారు. ఉత్సవాల్లో గిరిజనుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నారు.

అడవి తల్లికి క్షీరాభిషేకం, అలంకరణ

ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాన్ని గిరిజన సంఘాల నాయకులు గురువారం నిర్వహించారు. పార్వతీపురంలో ఉన్న అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, కొత్త దుస్తులు అలంకరించారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆదివాసీలతో కలిసి ఐటీడీఏ వరకు చేరుకున్నారు. అక్కడ పీఓ సేదు మాధవన్‌తో కలిసి అడవి తల్లి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ నాగరికతకు మూల పురుషులు ఆదివాసీలేనని అన్నారు. ఈ కార్యక్రమాల్లో గిరిజన సంఘ నాయకులు పల్ల సురేష్, పాలక రంజిత్, ఆరిక చంద్రశేఖర్, మంచాల ఈశ్వరరావు, ఇంటికుప్పల రామకృష్ణ, గౌరమ్మ, ఆరిక వెంకటరావు, మంచాల పారమ్మ, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం జరగనున్న ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షం పడినా సభకు, సందర్శకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన లేనట్లే..

ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని తొలుత వార్తలొచ్చాయి. ఆయన పర్యటనలో భాగంగా సభ నిర్వహణ కోసం అవసరమైన స్థల పరిశీలననూ గుమ్మలక్ష్మీపురం మండలంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి చేపట్టారు. మరలా ఆయన రావడం లేదని సమాచారం అందడంతో వేదికను చివరి నిమిషంలో పార్వతీపురానికి మార్చినట్లు తెలుస్తోంది.



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్